క్లుప్తంగా

పీర్ ఎడ్యుకేటర్స్ ఎంపిక



రొంపిచర్ల: విద్యార్థుల్లో ఆరోగ్య సమాచారాన్ని, మానసిక ఇబ్బందులను తెలుసుకోవడమే పీర్ ఎడ్యుకేటర్స్ బాధ్యతని సీహెచ్‌వో ఝాన్సీరాణి అన్నారు. మండలంలోని గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 10–19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల నుంచి శుక్రవారం పీర్ ఎడ్యుకేటర్స్‌ను ఎంపిక చేశారు. 6, 7, 8, 9, 10 తరగతుల నుండి పీర్ ఎడ్యుకేటర్స్‌ను ఎంపిక చేశారు. ప్రతి గురువారం ఏఎఫ్‌హెచ్‌సీ క్లీనిక్‌లను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన పీర్ ఎడ్యుకేటర్స్‌కు యూనిఫాం, టోపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సునీత, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి శ్రీనివాసరెడ్డికి జాతీయ పురస్కారం



నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రతిష్టాత్మకమైన రవీంద్రనాథ్ నేషనల్ అవార్డును అందుకున్నారు. హైద్రాబాద్‌లోని జానవాడ నియో కన్వెక్షన్‌లో గురువారం రాత్రి నిర్వహించిన ఎడ్యూ టెక్ ఎక్స్పో–2025 కార్యక్రమంలో అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డికి ఈ అవార్డును నిర్వాహకులు అందజేశారు. చేంజ్ మేకర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ విభాగంలో అవార్డును ప్రదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యారంగ పురస్కారం అందుకోవడం గొప్ప విషయమని తెలిపారు. ఉన్నత విద్యలో విద్యార్థి కేంద్రిత పద్ధతులు, సృజనాత్మకత, ఇన్నోవేషన్ ఆధారిత బోధన విధానాల కారణంగా జాతీయస్థాయి అవార్డు లభించిందని తెలిపారు. పురస్కారం అందుకున్న శాంతి శ్రీనివాసరెడ్డిని కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సర్వమంగళ మాంగళ్యే....



నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో చివరి శ్రావణ శుక్రవారం వ్రతాలు నిర్వహించారు. గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ పోలేరమ్మ, అంకమ్మతల్లి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ముందుగా అమ్మవార్లను అలంకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం చివరి శుక్రవారంలో సామూహిక కుంకు మార్చన నిర్వహిస్తారు. సాతులూరు గ్రామంలోని రామాలయంలో ఆలయ పూజారులు భాగవతుల సుబ్బారావు, భరద్వాజల ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆటో కారు ఢీ- నలుగురికి గాయాలు

నాదెండ్ల: గుంటూరు–నరసరావుపేట రహదారిపై సాతులూరు సమీపంలోని నూతన పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి ఆటో–కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. నరసరావుపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారును గుంటూరు నుంచి నరసరావుపేటకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురు, కారులోని మరో ఇరువురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

నరసరావుపేట: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పద్మభూషణ్, మెగాస్టార్ కొణిదెల శివశంకర వరప్రసాద్ చిరంజీవి జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానుల ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా చిరంజీవి చిత్రపటం ముందు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. సీనియర్ అభిమాని షేక్ రసూల్‌ను పార్టీ నాయకులు, మహిళలు శాలువాలతో సత్కరించారు. తెలుగు సినిమా రంగంలో చరిత్ర గర్వించదగ్గ మహా నటుడు చిరంజీవి అని, చిన్న స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ స్వయం కృషితో ఎదిగారన్నారు. ఏలూరి ప్రసాద్, అచ్చుల సాంబశివరావు, షేక్ అష్రఫ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, దమ్మవలం కొండలు, కృష్ణంశెట్టి ఏడుకొండలు, చిందుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణనాథుడే శ్రేష్ఠం

- ఆ... గణపయ్యనే పూజిద్దాం
- మరో నాలుగు రోజుల్లో పండుగ
- గ్రామాల్లో పందిళ్ల ఏర్పాటుకు శ్రీకారం



రసాయనిక రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలు

శావల్యాపురం: మరో నాలుగు రోజుల్లో సర్వ విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి పండుగ. పిల్లా–పెద్దా అందరూ ఉత్సాహంగా జరుపుకునే పర్వదినం ఇది. ఊరా–వాడా తారతమ్యం లేకుండా అందరూ సమిష్టిగా జరుపుకునే పెద్ద పండుగ. మూడు–ఐదు రోజుల లెక్కన జరిగే ఈ ఉత్సవాలకు ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో పందిళ్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ ఉత్సవానికి భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి.. ఆఖరున నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలని పలువురు పర్యావరణవేత్తలు, పోలీసులు సూచనలు చేస్తున్నారు.

రసాయనిక కాలుష్యాన్ని నివారించాలి

వివిధ రకాల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి తదుపరి పంట కాల్వలు, చెరువుల్లో కాలువుల్లో ఆ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. తద్వారా వాటిల్లో వాడే రసాయనాల వల్ల నీరు కలుషితమై మానవాళికి ముప్పు వాటిల్లుతోంది. చర్మవ్యాధులు, క్యాన్సరు, మూత్రపిండాలు, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. అంతేకాకుండా పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగి మృత్యువాత పడుతున్నాయి. ఈ నీటితో సాగు చేస్తున్న పంటల్లో సైతం రసాయనిక ఆనవాళ్లు కనపడుతున్నట్లు వివిధ పరిశోధనలో స్పష్టమవుతోంది.

మట్టి విగ్రహాలతో మేలు

మట్టి విగ్రహాలను తయారు చేసుకుని పూజలు చేసు కోవటం వల్ల వాతావరణంలో ఎటువంటి కాలుష్య ప్రభావం ఉండదు. బంక మట్టితో వినాయక ప్రతిమలు ఆధారంగా విగ్రహాలను తయారు చేసి పూజలు అనంతరం నిమజ్జనం చేస్తే ఆ నీరు కలుషితం కాదు. మానవాళికి ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం



మట్టి విగ్రహాలు వల్ల అందరికీ మంచి చేకూరుతుంది. అందరు ఐక్యంగా ఉండి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల సంఖ్య తగ్గించి మట్టి గణనాథులకే పూజలు చేపట్టాలి. యువత పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలి.

–బి.ప్రభాకర్‌రావు, రూరల్ సీఐ, వినుకొండ

ఆ.. విగ్రహాలతో మనకే ముప్పు



నేటి సమాజంలో రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాల వలన పర్యావరణంతోపాటు మనకూ ముప్పే. మట్టి విగ్రహాలకు సహజంగా వేసిన రంగులు వల్ల ఇబ్బంది ఉండదు. నీటిలో నిమజ్జనం చేయటం ఎవరికీ నష్టం వాటిల్లదు.

–రావిపూడి రమ్య, మండల ప్రాథమిక వైద్యాధికారి

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఎస్‌బీఐ డీజీఎం కృష్ణ కుమార్ ప్రభు



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కృష్ణకుమార్ ప్రభు

రొంపిచర్ల: ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని ఎస్‌బీఐ బ్యాంక్ డీజీఎం కృష్ణ కుమార్ ప్రభు అన్నారు. మండలంలో గోగులపాడు గ్రామంలో గురువారం రాత్రి ఎస్‌బీఐ బ్యాంక్ రొంపిచర్ల శాఖా ఆధ్వర్యంలో జన సురక్ష పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న డీజీఎం మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి సంరక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత, సైబర్ క్రైం గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ కలిగియుండాలన్నారు. బ్యాంక్ ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. తొలుత రొంపిచర్లలో రీ మోడలింగ్ చేయబడిన బ్యాంక్‌ను డీజీఎం కృష్ణకుమార్ ప్రభు ప్రారంభించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ రీ మోడలింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం రవికుమార్, మేనేజర్ మల్లిఖార్జునరావు, బ్యాంక్ సిబ్బంది, గ్రామపెద్దలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రైతులు.. పొగాకు సాగు చేయవద్దు



మాట్లాడుతున్న ఏడీఏ రవికుమార్

ఈపూరు(శావల్యాపురం): రైతులు పొగాకు సాగు చేయవద్దని వినుకొండ ఏడీఏ సి.హెచ్.రవికుమార్ అన్నారు. శుక్రవారం ఈపూరు మండలం అగ్నిగుండాల గ్రామంలో పొగాకు సాగు చేయు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు పొగాకు పంటను రైతులు సాగు చేయరాదన్నారు. గత ఏడాది పొగాకు సాగు చేసిన రైతులు కొనుగోలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. ప్రైవేటు కంపెనీ వారు దళారులు మోసపూరిత మాటల నమ్మి పొగాకు సాగు చేయరాదన్నారు. పొగాకు పంట సాగు చేయటం వలన ఆర్థికంగా రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వ నిబంధనలు రైతులు పాటించటం ద్వారా ఆర్థిక ఇబ్బందుల నుంచి అధిగమించవచ్చునన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వరి పంట సాగు చేయాలన్నారు.ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపాలన్నారు. అయిల్ ఫాం, డ్రాగన్, మామిడి,తదితర పండ్ల తోటలు సాగు చేయటం ద్వారా ప్రభుత్వ పరంగా రాయితీ కూడా వస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు,ఎంపీఈవో శ్రీనివాసరావు,రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ, అధ్యక్షుల ఎన్నిక



ఎన్నికైన వారిని అభినందిస్తున్న పార్టీ నాయకులు

నూజెండ్ల: మండలంలోని జంగాలపల్లి, ములకలూరు గ్రామాల్లో వైఎస్సార్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. మండల కన్వీనర్ ముప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంగాలపల్లి నుంచి చప్పిడి వీరాంజనేయులు, ములకలూరు గ్రామం నుంచి వంగపల్లి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, పాలక వర్గం సభ్యులను వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ అమ్మిరెడ్డి అంజిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అభినందించారు. వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కంచర్ల బాబు, వంగూరి ప్రసాద్, కాలువ రమణారెడ్డి, పరిమి శేషు, తలారి ఆంజనేయులు, పారా వెంకటేశ్వర్లు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు ఆస్పత్రిలో వర్క్‌షాపు

ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



లైవ్ సర్జికల్‌లో పాల్గొన్న డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, శ్రీవర్ధిని, ఇతర డాక్టర్లు

నరసరావుపేట: కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజుల పాటు ఏర్పాటు సెకెండ్ హ్యాండ్‌సన్ లైవ్ సర్జికల్ వర్క్‌షాపును శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. జూనియర్ డాక్టర్లకి దగ్గరుండి వాళ్ళ చేతుల మీదుగా ఆపరేషన్ చేయించటమే దీని ప్రధాన ఉద్దేశ్యమని హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ నుంచి డాక్టర్ చావన్ కార్తీక్, కాకినాడకు చెందిన డాక్టర్ నికిత రెడ్డి, గన్నవరం నుంచి డాక్టర్ ఎస్.అఖిలేశ్వర్, కేరళకు చెందిన డాక్టర్ నిర్మల నరేంద్రన్, వినుకొండకు చెందిన డాక్టర్ కవిత హాజరయ్యారన్నారు.. జూనియర్ డాక్టర్లకు శిక్షణ ఇచ్చేందుకు గన్నవరం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీకు హెచ్‌ఓడీ డాక్టర్ టి.సతీష్‌చంద్ర, రిటైర్డు గుంటూరు జనరల్ హాస్పిటల్ హెచ్‌ఓడీ డాక్టర్ రాజేంద్రప్రసాద్, నెల్లూరు డాక్టర్ సంపత్, మిర్యాలగూడ డాక్టర్ డాక్టర్ శేఖర్ రెడ్డి, దర్శి నుంచి డాక్టర్ సుధీర్ చంద్ర బృందం పాల్గొన్నారు. క్యాంపు కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీవర్ధిని, డైరెక్టర్ కంజుల కోటిరెడ్డి, సీఈఓ మస్తాన్ రెడ్డి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం తప్పనిసరి

రొంపిచర్ల: వినాయకుని పందిళ్ల ఏర్పాటుకు ముందస్తు సమాచారం తప్పనిసరిగా అందివ్వాలని ఎస్ఐ మణికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విగ్రహం ఎత్తు, నిమజ్జనం తేదీ పోలీసులకు తెలియజేయాలన్నారు. వినాయకుని విగ్రహాలు తెచ్చేటప్పుడు, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిటీవారే తీసుకోవాలన్నారు. మండపాల్లో సౌండ్ సిస్టమ్‌లు అనుమతి లేదన్నారు. పోలీసు శాఖ సూచించిన 11 నిబంధనలను పాటించాలన్నారు.

ముగిసిన క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

యడ్లపాడు: బోయపాలెంలోని శ్రీ అనంతలక్ష్మీ స్పిన్నింగ్ మిల్స్ ఆవరణలో 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ట్రస్ట్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తల్లిదండ్రులు పానయ్య, నాగరత్తమ్మ స్మారకార్థం సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటైన ఈ శిబిరానికి బసవతారకం ఇండో– అమెరికన్ హాస్పిటల్, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ సంయుక్తంగా సహకారాన్ని అందించాయి. ఈ వైద్య శిబిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 300 మంది ప్రజలు హాజరై క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. బసవతారకం ఆసుపత్రికి చెందిన డాక్టర్ శ్రావణి, రవిశంకర్, రేణుక, ప్రవల్లిక, హరీష్, ప్రణీత తదితర వైద్య బృందం ఆయా పరీక్షలు నిర్వహించి రిపోర్టు కాపీలను అందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అందరికీ సామినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు, మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామినేని ఫణికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నార్నెపాడులో రీసర్వే గ్రామ సభ

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో రీ సర్వేలో భాగంగా ముసాయిదా డ్రాఫ్ట్ లాండ్ రికార్డుపై శుక్రవారం గ్రామ సభ జరిగింది. గ్రామసభలో తహసీల్దార్ కె.నగేష్ పాల్గొని రీసర్వే వివరాలను రైతులకు వివరించారు. ఇంకా కొంతమంది రైతులకు సంబంధించిన భూముల రికార్డులు నమోదు కావాల్సి ఉందని, చిన్నపాటి సమస్యలతో ఆలస్యమైందన్నారు. రీసర్వే జరిగిన అన్ని రకాల భూముల వివరాలు రికార్డులలో నమోదు చేయటం జరిగిందని, రైతులు పరిశీలించుకోవచ్చన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత వీఆర్వో దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. భూముల వివరాలన్నీ పూర్తి స్థాయిలో నమోదు చేపట్టడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, మండల సర్వేయర్ రాజు, ఆర్ఐ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన పత్తిపాటి నరేంద్ర తన కుమారుడు అస్వస్థతతో ఉండటంతో ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించేందుకు వచ్చాడు. ఈ క్రమంలో తన ఏపీ 07 బీజడ్ 6067 గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని వైద్యశాల ప్రాంగణంలో పార్క్ చేశాడు. వైద్య సేవల అనంతరం బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించ లేదు. అపహరించారని నిర్ధారించుకొని ఫిర్యాదు చేశాడు.

మహిళల బాల్ బ్యాడ్మింటెన్ శిక్షణ ప్రారంభం



వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్డులోని నిర్మల ఐసీఎస్ఈ స్కూల్ క్యాంపస్ నందు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటెన్ మహిళా జట్టు, సబ్ జూనియర్ బాలికల జట్లకు శిక్షణ శిబిరాన్ని నిర్మలా విద్యాసంస్థల సుపీరియర్ సిస్టర్ సిసిలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోచింగ్ క్యాంప్‌లో బాగా మెలుకువలు నేర్చుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కోచింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 24 మంది పాల్గొంటారని, కోచింగ్ అనంతరం ఈ నెల 29వ తేదీన ప్రకాశం జిల్లా చేవెళ్లలో జరిగే 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా జాయింట్ సెక్రటరీ జోనానాయక్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఇన్నారెడ్డి, డాక్టర్ తేజ చంద్ర, హెచ్‌ఎం వీరప్పయ్య, పీడీ ఆర్. రాధాకృష్ణమూర్తి, పీఈటీలు శ్రీను, గోపి, సంధ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్ వై. శ్రీనివాసరావు, ఈ. శివశంకర్, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, ఏడీ ఆర్. ఆంజనేయులు పాల్గొన్నారు.

పాత చెర్వుకొంపాలెంలో పోలీస్ పికెట్



బందోబస్తులో పోలీసులు

నూజెండ్ల: మండల పరిధిలోని పాత చెర్వుకొంపాలెం గ్రామంలో గవిటిరాయి (పాదులు)కి వెళ్లే దారి వివాదాస్పదంగా మారింది. మా పల్లె మీదుగా వెళ్లొద్దని కాలనీవాసులు, పూర్వకాలం నుంచి దారి ఉందని గ్రామస్తులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఐనవోలు పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ఎస్సై కృష్ణారావు పర్యవేక్షణలో గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో వివిధ వర్గాల మనోభావాలకు సంబంధించిన అంశమైనప్పటికీ పోలీసుల మోహరింపుతో వివాదం సద్దుమణిగింది. ఎస్సై వివరాల మేరకు గ్రామంలో రాములవారి గుడి పునఃప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా గ్రామ దేవతలుగా భావించే పాదులను పునః ప్రతిష్టించాలని నిర్ణయించారు. హరిజనవాడకు దగ్గరగా ఉన్న పాదులను కదలించే క్రమంలో గ్రామస్తులను కాలనీవాసులు అడ్డగించడంతో వివాదం మొదలైంది. సమాచారం అందటంతో బందోబస్తుతో గ్రామానికి వెళ్లి ఇరువర్గాల పెద్దలను పిలిపించి నచ్చచెప్పడంతో సమస్య పరిష్కారమైనట్లు ఎస్సై తెలిపారు. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని ఇరువర్గాలను హెచ్చరించారు. రానున్న రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో బందోబస్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయండి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని శనివారం ఒంగోలులో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, వామపక్ష వాదులు భారీగా తరలి రావాలని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు ఒంగోలు కళా ఉత్సవాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెయ్యి మందికి పైగా కళాకారులు పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా శనివారం భారీ ప్రజాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని ఆయన చెప్పారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బొంత ధనరాజ్,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని,వేలూరు గ్రామ కార్యదర్శి ఎలిక శ్రీనివాసరావు,నాయకులు మల్లికార్జున్ ,షేక్ నన్నే, సయ్యద్ నానా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సభకు....

వినుకొండ: పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు ఏలూరి శశికుమార్ ఆదేశాల మేరకు మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల వయ్యకంటి శివ ప్రసాద్ యానాది కాలనీలో విజయవాడలో జరిగే సభను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరిగే స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కాలనీలోని నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం కట్టా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శివాజీ వెంకయ్య, కృష్ణ, ఎస్సీ నాయకుడు కోటయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

మంత్రిని కలిసి రూ. 4 కోట్ల నిధులు కోరిన ఎమ్మెల్యే చదలవాడ



మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, మరమ్మతుల కోసం అవసరమైన రూ.4 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన, ప్రజల సౌకర్యార్థం అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి నిధులు కీలకమని మంత్రికి వివరించారు. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదల, మరమ్మతులకు తక్షణ నిధుల అవసరాన్ని ఆయన చెప్పారు. మంత్రి నారాయణ సానుకూలంగా స్పందిస్తూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. త్వరలోనే అవసరమైన ప్రతిపాదనలను సిద్ధంచేసి పురపాలక శాఖకు సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.

తిమ్మాపురం బైపాస్ వద్ద పోలీసుల తనిఖీలు

- 51 మందిపై కేసులు నమోదు
- రూ.52, 785 జరిమానా విధింపు



తిమ్మాపురం బైపాస్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం బైపాస్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత కోసం పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ సిబ్బంది పాల్గొన్న ఈ తనిఖీలలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన 51 వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.52,785 జరిమానాలు విధించారు. అలాగే, మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజల ప్రాణభద్రత తమకు ప్రథమ ప్రాధాన్యమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ప్రాణాలను రక్షించే కవచమని, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రత కోసం తరచూ తనిఖీలు కొనసాగుతాయి అని తెలిపారు.

ఆయిల్‌ఫాం సాగుతో రైతులకు మేలు

- ప్రభుత్వ ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఉద్యానవనశాఖ అధికారి వెంకటరావు



నాదెండ్లలో అయిల్‌పాం ప్లాంటేషన్ చేస్తున్న అధికారులు, నాయకులు, రైతులు

నాదెండ్ల: రాష్ట్రంలో ఆయిల్‌ఫాం సాగుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఐ.వెంకటరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో గోద్రేజ్ అగ్రోవెట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రతి సంవత్సరం 150 లక్షల కోట్ల టన్నులు ఆయిల్ దిగుమతి అవుతుందన్నారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించేందుకు దేశీయంగా పంట సాగును ప్రోత్సహించి ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసిన నాలుగేళ్ల నుంచి కాపు ప్రారంభమై 30 ఏళ్ల వరకూ నిరంతరం హెక్టారుకు రూ.1 లక్ష వరకూ దిగుబడి రైతులకు లభిస్తుందన్నారు. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలకు ఆయిల్‌పాం చెట్లు తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తాయన్నారు.

రైతుల నుంచి నేరుగా కంపెనీలే కొనుగోలు చేస్తాయని, దీంతో రైతులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. హెక్టారుకు 150 మొక్కలను ప్రభుత్వమే పూర్తి ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీలక్ష్మీ, ఏవో శ్రీలత, నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, గోద్రేజ్ కంపెనీ అధికారి శ్యామ్ నాయకులు పాల్గొన్నారు.